మాతా,శిశు ఆరోగ్యానికి భరోసా

- గణనీయంగా తగ్గిన మరణాలు
- హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి.. వైద్యుల నిరంతర పర్యవేక్షణ
- ప్రత్యేక యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్య సమాచారం సేకరణ
- అత్యవసరమైతేనే జిల్లా కేంద్ర ఆసుపత్రులకు తరలింపు

డోన్ : ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాతా,శిశు ఆరోగ్యానికి భరోసానిస్తూ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆసుపత్రులను పునరుద్ధరణతోపాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ రోగుల వద్దకే వైద్య సేవలు అందజేస్తున్న ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక దృష్టిని సారిస్తూ సుఖ ప్రసవాలు జరిపేందుకు మాతా,శిశు మరణాలు నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు వైద్యులు. గర్భం దాల్చిన నాటి నుంచి ఆశ, ఏఎన్ఎంలు ఇళ్లవద్దకు వెళ్లి గర్భిణుల ఆరోగ్య వివరాలు సేకరించడంతోపాటు వారు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా ప్రతినెలా 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకం నిర్వహించే వైద్య పరీక్షలు సత్ఫలితాలిస్తున్నాయి. డోన్ ఆసుపత్రిలోని సిమ్యాక్స్ సెంటర్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కృష్ణగిరి, వెల్దుర్తి, తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, దేవనకొండ మండలాలకు చెందిన గణులకు ప్రతి నెలా అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతినెలా ఏడు వందలకుపై గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యుల సమాచారం.



వైద్య పరీక్షల అనంతరం గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ (ఫైల్)

హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ప్రత్యేక దృష్టి

వైద్య, ఆరోగ్య సిబ్బంది హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రక్తహీనత, మూడు, నాలుగు సార్లు అబార్షన్, చిన్న వయసులోనే గర్భం దాల్చడం , అధిక బీపీ, గుండె, కిడ్నీ జబ్బుల భారిన పడిన గర్భిణులను హైరిస్క్ ప్రెగ్నెన్సీగా పరిగణిస్తారు. వీరికి ప్రసవ సమయంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తడం మూలంగా ప్రాణాపాయం కలిగే అవకాశం ఉంది. దీంతో ముందస్తుగా చర్యలు చేపడుతూ సుఖ ప్రసవం జరిగేలా చూస్తున్నారు.

పక్కా ప్రణాళిక బద్ధంగా ఆసుపత్రులకు

ప్రసవ సమయం వచ్చిన హైరిస్క్ గర్భిణులను పెద్ద ఆసుపత్రులకు పంపే ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు వైద్యసిబ్బంది. హైరిస్క్ ప్రెగ్నెన్సీల ఏఎన్ఎం యాప్ ద్వారా పీహెచ్‌డీ మెడికల్ ఆఫీసర్‌కు పంపుతారు. వీరిని ఏ ఆసుపత్రికి తరలించాలనే విషయంపై ముందే ఆశ, ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్ ఓ నిర్ణయానికి వస్తారు. ఈ ప్రక్రియపై రాష్ట్రస్థాయిలో కూడా మెటర్నల్ మ్యానిటరింగ్ సెల్ నుంచి పర్యవేక్షణ ఉంటుంది. ఐదు నెలల గర్భంతో ఉన్న ప్రతిఒక్కరికి టిఫ్ఫా స్కానింగ్ ద్వారా పిండాన్ని నిశితంగా పరిశీలిస్తారు. పిండం ఎదుగుదల, అవయవాల ఏర్పాటు, లోపాలు ఈ స్కానింగ్ ద్వారా సులువుగా పసిగడుతున్నారు. ఈ మేరకు పిండం లోపాలను సరిదిద్దేందుకు, ఎదుగుదలకు వైద్యుల పర్యవేక్షణలో నిరంతరం మందుల పంపిణీ, పరీక్షలు చేపడుతున్నారు. వీరిని వారం ముందుగానే పెద్దాసుపత్రులకు తరలించి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో సుఖ ప్రసవాలు జరిస్తున్నారు వైద్యులు. దీంతో మాతా,శిశు మరణాలు గణనీయంగా తగ్గాయి.

పది శాతం హైరిస్క్ ప్రెగ్నెన్సీలు



ప్రభుత్వాసుపత్రిలో ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ యోజన పరీక్షలు నిర్వహించడంతోపాటు సూచనలు ఇస్తున్నాం. దాదాపు 10 శాతం హైరిస్క్ గర్భిణులను గుర్తిస్తున్నాం. గత నెలలో 96 మందికి పరీక్షలు నిర్వహించగా 26 మంది హైరిస్క్‌లో ఉన్నట్లు గుర్తించాం. వారిపై ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చెక్‌లిస్ట్, డేటా ఎంట్రీల ద్వారా వీరి వివరాలను నమోదు చేసి ఎప్పటికప్పుడు తగు వైద్య పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ రమ్యశిల్ప, గైనకాలజిస్ట్, ప్రభుత్వాసుపత్రి, డోన్

ప్రభుత్వం అన్నిరకాల ముందస్తు చర్యలు



హైరిస్క్ గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. గర్భం దాల్చిన నాటి నుంచి వారి ఆరోగ్యాన్ని వైద్య, ఆరోగ్య సిబ్బందితోపాటు వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. ప్రభుత్వాల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తల మూలంగా మాతా శిశు మరణాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. కిందిస్థాయి నుండి పైస్థాయి వరకు మాతా,శిశు ప్రాణాలు కాపాడేందుకు సిబ్బందితో కలిసి వైద్యులు నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు.

– డాక్టర్ ఎస్ఎండీ హనీఫ్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డోన్

క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న దాత బిజ్జల కృష్ణారెడ్డి కుటుంబసభ్యులు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెసిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దివంగత బిజ్జల పెద్దరామసుబ్బారెడ్డి, లింగమ్మల కుమారుడు బిజ్జల కృష్ణారెడ్డి,సుజల దంపతులు రూ.15,116ల నగదు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు దాతలు నగదు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ఉత్సవాలు

బేతంచెర్ల: మండలపరిధిలోని శైవ పుణ్యక్షేత్రమైన శ్రీ ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల18 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయం నుంచి శ్రీముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులను ఎడ్ల బండిపై మేలతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి ఆర్ఎస్ రంగాపురంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, ఈఓ మద్దిలేటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం



దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండలంలోని చింతలాయిపల్లె ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సమత ఇటీవల పదోన్నతిపై వెళ్లడంతో మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బాలరాజు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, పూర్వవిద్యార్థులు ఉపాధ్యాయిని సమత దంపతులకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంకన్న, ఆనందరావు, బాదుల్లా,నాగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

28న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు సభ నిర్వహిస్తామన్నారు. అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక రావాలని కావాలని సూచించారు. అదేవిధంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

ఎల్లమ్మకు సామూహిక బోనాలు



బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో వెలసిన గోధుమారి ఎల్లమ్మకు మంగళవారం మహిళలు సామూహిక బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఆర్టీసీకి రూ. 17.46 లక్షల ఆదాయం

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోకు రూ. 17.46 లక్షల ఆదాయం చేకూరినట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండగ సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం శ్రీశైలానికి 70 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. గతేడాదితో పోలిస్తే రూ. 4.19 లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. డిపోకు ఆదాయం చేకూరేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది, యూనియన్ నాయకులకు అభినందనలు తెలియజేశారు.

అన్నదాన సంస్థకు విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థకు కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని ఉలిందకొండ గ్రామానికి చెందిన కె.ఈశ్వర్‌రెడ్డి కుమారుడు కె.వెంకటరామిరెడ్డి రూ.10,1116ల విరాళాన్ని అందించినట్లు సంస్థ నిర్వాహకులు దస్తగిరిరెడ్డి మంగళవారం తెలిపారు. దాత వెంకటరామిరెడ్డిని సంస్థ తరుపున ఆయన అభినందిస్తూ ప్రత్యేక కృజత్షలు తెలిపారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దమ్మ హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని భానుముక్కలలో మంగళవారం శ్రీపెద్దమ్మ తల్లి దేవర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అర్ధరాత్రి బలిక్రతువు జరుగనుంది. అమ్మవారిని దర్శించుకునందేకు వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గ్రామపెద్దలు, ప్రజలు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. పెద్దమ్మ మూలవిరాట్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 11 ఏళ్ల తర్వాత పెద్దమ్మ దేవరను రైతు సంఘం,గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు,భానుముక్కల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని కాపాడండి

డోన్ టౌన్: జాతీయ రహదారుల వెంట పచ్చదనాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె మహారాజ్ నేషనల్ హైవే అధికారి రిషికేష్‌కు వినతి పత్రం అందజేశారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఏలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికి వేస్తున్నారని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టోల్ గేట్ వద్ద ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలా వెంకటేశ్వర్లు, భరణి చంద్ర, బాలరాజు, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ ఉపన్యాసకుడు కృష్ణశశాంక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. మాతృభాషను ఔపోసన పట్టకుండా అవగాహన చేసుకోకుండా ఇతర భాషల్లో పట్టుసాధించడం అసాధ్యమన్నారు. విద్యార్థుల గేయాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణదాసు, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శివ కుమారస్వామి మాట్లాడుతూ మాతృభాషాలో మాట్లాడటం వలన మనసులోని భావాలు స్పష్టంగా అర్థం అవుతాయన్నారు. కన్న తల్లిని, జన్మభూమిని, మత్రుభాషని ఎవ్వరు మరువకూడదని, ప్రతిక్కరూ మాతృభాషని ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, షఫీవుల్లా, రమేష్ బాబు, అహమ్మద్ హుస్సేన్, హెప్సిబా జ్యోతి, విద్యా కమిటీ చైర్మన్ రామ సుబ్బయ్య పాల్గొన్నారు.

అహోబిలేశుడి సేవలో ప్రెస్ అకాడమీ చైర్మన్



అహోబిలేశుడిని దర్శించుకునేందుకు వస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎగువ, దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమృత వల్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి జ్ఞాపికతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి ఆశ్వీరచనాలు అందజేశారు.

ఉత్తమ విద్య అందించటం ఉపాధ్యాయుల బాధ్యత



విద్యార్థుల స్కిల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్ రావు

అవుకు: విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని మండల విద్యాధికారి శ్రీధర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకు ఎంపీపీ మెయిన్ స్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, ఎంతమేరా అర్థమవుతుంది తదితర విషయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో బ్లాక్‌బోర్డుపై లెక్కలు రాయించి పరీక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో బడుల్లో సకల వసతులు కల్పిస్తుందని, విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని, టాయిలెట్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు జీనాతున్నిసా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

డోన్ టౌన్: గవర్నర్ కోటాలో ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబును ఎంపికను హర్షిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది రాగుల రాముడు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న వెనుకబడిన వర్గాల రాజీకయాభివృద్ధికి చేయూనిస్తున్నారని అభినందనలు తెలిపారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో అరకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రవిబాబు గిరిజను అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. సమావేశంలో నంద్యాల జిల్లా ఎన్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాలేటి శ్రీనివాసులు, పరమేష్, ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు ప్యాపిలి సుంకన్న, వెంకటమాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలు అందజేస్తున్న బీవీ నాగార్జునరెడ్డి

కోవెలకుంట్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గాంధీనగర్, ఎల్ఎం కాంపౌండ్, గాంధీసెంటర్, సంతపేట, గడ్డవీటి, బసిరెడ్డిబావి వీధి, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయా కాలనీల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు దశరథరామిరెడ్డి, హర్ష, న్యాయవాది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస నరేష్ రెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం నిర్వహించారు. రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపునకు కృషి చేయాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డక్కి శేఖర్, తిరుమలేశ్వర్‌రెడ్డి, అజాం బాషా, బుగ్గన కుమార్‌రెడ్డి, వలీ బాషా, మురళీధర్ రెడ్డి, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతులకు వసంతోత్సవం



పాదయాత్రగా యాగంటి క్షేత్రానికి ఇరుముడులతో వస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పూర్ణాహుతి, శివ పార్వతుల వసంతోత్సవం కార్యక్రమంతో మహా శివ రాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు జరిగాయి. శివదీక్ష స్వీకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాతపాడు గ్రామంలోని యాగంటి క్షేత్రం వెళ్లు రహదారిలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఇరుముడులు ధరించి తలపై పెట్టుకొని శివనామస్మరణ చేస్తూ పాదయాత్రగా యాగంటి క్షేత్రంకు చేరుకున్నారు. ఆయనతో పాటు వివిధ గ్రామాల నుంచి శివదీక్ష స్వీకరించిన స్వాములు కాలినడకన క్షేత్రానికి వచ్చారు. యాగంటి క్షేత్రం చేరుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి క్షేత్ర ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ఇరుముడిని స్వామివారికి సమర్పించి దీక్ష విరమణ చేశారు. ఈ హోమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డి పాల్గొన్నారు. హోమం అనంతరం శ్రీ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు తెప్పోత్సవ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా ఆలయ కమిటీ సభ్యులు, ఆయకట్టు దారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థలో భక్తులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకులు మల్కిరెడ్డి దస్తగిరిరెడ్డి, రామారెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ యాగంటిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానంద రెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, నందీపైపుల రామచంద్రారెడ్డి, బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ, కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డి

మట్కా బీటర్ల అరెస్టు

డోన్ రూరల్ : స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన మట్కా బీటర్లు ఈడిగ మద్దయ్య, షేక్ హుసేనీ, మాదిగ సూరి, మాదిగ గోపాల్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. ఇందిరానగర్ కాలనీ సమీపంలోని బండల డిపో వద్ద ప్రజలకు మాయ మాటలు చెప్పి మట్కా రాస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వీరి నుంచి రూ. 11,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే టీచర్స్ కాలనీకి చెందిన టి.రాధ అనే మహిళా రైల్వే మసీద్ వద్ద మట్కా రాస్తుండగా అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి రూ.1,800 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళ అదృశ్యం

బేతంచెర్ల: తన భార్య రహేనా అదృశ్యమైందని పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన భర్త రఫీ పోలీస్ స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య మంగళవారం తెలిపారు. రహేనా ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకి తెలియలేదన్న భర్త రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

ముగిసిన ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర, భోగేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి ఉత్సవాలు మంగళవారం వసంతోత్సం, గ్రామోత్సవంతో ముగిశాయి. ఆలయం నుంచి పార్వతీ సమేత భోగేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

స్వల్ప కాలిక కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో స్వల్ప కాలిక కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ రాయపరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంకెవీవై -4 పథకం కింద 10వ తరగతి పాసైన వారికి ఫిట్టర్ ప్యాబ్రికేషన్, ఎలక్ట్రిషియన్ డొమెస్టిక్ సెల్యూషన్స్‌లో మూడు నెలల స్వల్ప కాలపరిమితి కోర్సులలో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థులకు సరిఫికెట్లుతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాడిరైతుల అభివృద్ధే లక్ష్యం



సబ్సిడీ చెక్కులను అందజేస్తున్న మధుసూదన్‌బాబు

బనగానపల్లె: పాడిరైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డయిరీ ముందుకు సాగుతుందని యూనిట్ మేనేజర్ మధుసూదన్ బాబు తెలిపారు. ఈ మేరకు బనగానపల్లె యూనిట్ పరిధిలోని పలు గ్రామాల్లో పశుగ్రాసం పెంచుకున్న పాడిరైతులకు మంగళవారం రూ. 93, 500 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నందవరం గ్రామానికి రూ.32,300, బీరవోలు కేంద్రానికి రూ.22,450, కృష్ణగిరి, జ్వాలాపురం, పండ్లాపురం గ్రామాలకు సంబంధించి రూ.10 వేలు, మీరాపురం పాడి రైతులకు రూ.8750 చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ డయిరీ రైతులకు సంక్షేమం కోసం అమలు చేస్తున్న లీటర్‌కు రెండు రూపాయల బోనసును ఏజెంట్ల ఖాతాల్లో జమ చేస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు శ్రీనివాసరెడ్డి,చంద్రశేఖర్, సురేష్, తిరుపతయ్య,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రామకృష్ణ బోధనలు పాటించాలి



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: రామకృష్ణ పరమ హంస బోధనలను యువత పాటించాలని, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడువాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి జోన్నలగడ్డ శ్రీనివాసులు తెలిపారు. రామకృష్ణ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహ అవరణలో ఆయన జీవిత చరిత్ర పుస్తకాలను వారు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సదస్సును జయప్రదం చేయండి

డోన్ టౌన్: రాజమండ్రిలోని నన్నయ యూనివర్శిటీలో బుధవారం జరిగే యూనివర్శిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి పవన్ కోరారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సదస్సు బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు అమృత్‌రాజ్, రాఘవేంద్ర, కిరణ్, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.